
సాక్షి
బాపట్ల
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



జలపాలేశ్వరుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి ఫాల్గుణ బహుళ సప్తమి సోమవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
బాపట్ల	6.26	4.44
నరసరావుపేట	6.28	4.47
గుంటూరు	6.26	4.44

న్యూస్‌రీల్

శిక్షణకు అధికారులు హాజరు తప్పనిసరి




నరసరావుపేట: ఎన్నికల శిక్షణకు పోలింగ్ పర్సనల్స్ తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ పర్సనల్స్‌కి తెలియజేయాలన్నారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన ట్రైనింగ్ ఆర్డర్స్ పోలింగ్ పర్సనల్స్ అందరికీ వచ్చాయని తెలిపారు. పోలింగ్ పర్సనల్స్ అంతా పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్ -12ని పూర్తిచేసి శిక్షణకు వచ్చే సమయంలో తీసుకొని రావాలని వారికి ఆర్‌ఓలు స్పష్టంగా సూచించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయా అనేది ఆర్‌ఓలు పరిశీలన చేయాలని తెలిపారు. డీఆర్వో కె.వినాయకం, జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

5 వరకు ఏపీఆర్‌జేసీ సెట్ గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి గానూ ఆన్‌లైన్ దరఖాస్తుకు గత నెల 31న ముగిసిన గడువును ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతితోపాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి ఏపీఆర్ఎస్ క్యాట్-2024, జూనియర్ ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించనున్న ఏపీఆర్‌జేసీడీసీ సెట్-2024కు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్ సైట్ ద్వారా ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు.

గజేంద్ర మోక్షంలో నారసింహుడు



మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి గజేంద్ర మోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించగా కైంకర్యపరులుగా శేషగిరిరావు, కల్యాణి, ఆస్థాన కైంకర్యపరులుగా తాడికొండ తిరుమలరావు, తాడికొండ సాయికుమార్ వ్యవహరించారు.

పోలీసు తనిఖీల్లో రూ.12 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేటటౌన్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా సోమవారం మండలంలోని బొప్పూడి గ్రామ చెక్‌పోస్టులో ఎటువంటి ఆధారాలు లేని రూ.12 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ జి.రవికృష్ణ తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా చర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి తిమోతి కారులో గుంటూరు వైపు వెళుతున్న క్రమంలో సోదా చేయగా ఎటువంటి ఆధారాలు లేని నగదు పట్టుబడిందని చెప్పారు. స్వాధీనం చేసుకొని, ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

యార్డులో 1,21,030 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,21,030 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,14,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,882 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

బాబు కక్ష.. పండుటాకులకు శిక్ష

- ఊతకర్రను లాగేశారు
- చంద్రబాబుకు మా ఉసురు తప్పదు
- ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లను ఆపేస్తారా!
- సుదూరంలోని సచివాలయాలకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలి?
- ఏం తప్పుచేశారని వలంటీర్లపై అక్కసు
- ప్రభుత్వ పథకాలన్నీ ఇంటికి చేరుస్తున్నారు
- కరోనా సమయంలోనూ సేవలందించారు
- పింఛన్ల పంపిణీకి చంద్రబాబు అడ్డుపడటంతో అవ్వాతాతల ఆగ్రహం

ఈ నెల నుంచి పింఛన్ మొత్తం వలంటీర్లు ఇంటికి తెచ్చి ఇవ్వరన్న వార్తలు అవ్వాతాతలు, దివ్యాంగుల గుండెల్లో గుబులు రేపుతోంది. ప్రతిపక్ష నేత చంద్రబాబు వారి అనుచరుల వరుస ఫిర్యాదులతో సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకూ వలంటీర్ల సేవలను నిలిపి వేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ప్రజలకు వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. ఇందుకు చంద్రబాబు అండ్ కో కారణమన్న విషయం తెలుసుకుని పింఛన్‌దారులు మండి పడుతున్నారు. బాబు పాలనలో పింఛన్ కోసం గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి నానాపాట్లు పడ్డ విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని ఆందోళన చెందుతున్నారు.



బాపట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీరు (ఫైల్ ఫొటో)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పచ్చ పార్టీ కూటమికి తమపై అంత అక్కసు ఎందుకో అర్థంకాక అవ్వాతాతలు వాపోతున్నారు. వలంటీర్ల సేవలు నిలిపి వేయటంతో మార్చి పింఛన్ ఇంటివద్దకు వచ్చి ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దివ్యాంగులు మరింత ఆందోళన చెందుతున్నారు . ఇందుకు కారణమైన చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. ఇదే సందర్భంలో వలంటీర్ల సేవల్ని వారు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. పింఛన్ల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలుగకూడదనే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15 నుంచి వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పారు. అదే ఏడాది అక్టోబర్ 2 నుంచి గ్రామ సచివాలయ వ్యవస్థను తెరపైకి తెచ్చారు. గ్రామ స్థాయిలో అన్ని ప్రభుత్వ పథకాల్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు సకాలంలో అందిస్తున్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా అర్హులైన వారికి పథకాలు అందుతున్నాయి.

తలలో నాలుకలా మారిన వలంటీర్లు

వలంటీర్లు వారి పరిధిలోని కుటుంబాలకు తలలో నాలుకలా మారారు. అన్నీ తామై ప్రజలకు సేలందిస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందాయి. మన రాష్ట్రంలో నెలకొల్పిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రశంసలు పొందాయి. ఇది జీర్ణించుకోలేని చంద్రబాబు, ఆయనకు అండగా ఉన్న ఎల్లో మీడియా ఆదినుంచి వలంటీర్ల వ్యవస్థపై అక్కసు పెంచుకుంది. అడుగడుగునా విషం చిమ్మింది. చివరకు ఎన్నికల్లో వలంటీర్లను తప్పించాలని పదే పదే డిమాండ్ చేశారు. ఇందుకోసం చంద్రబాబు అండ్ టీం అదేపనిగా కుట్రలకు దిగింది. వలంటీర్లకు వ్యతిరేకంగా పచ్చ పత్రికల్లో కథనాలను వండి వార్చింది. పలుమార్లు ఎన్నికల కమిషన్‌కూ ఫిర్యాదులు చేసింది. దీంతో ఎన్నికలు ముగిసే వరకూ వలంటీర్ల సేవలను నిలిపి వేయాలని ఉత్తర్వులిచ్చింది. దీంతో ఈ నెల నుంచి వలంటీర్ల సేవలు నిలిచి పోయాయి. దీంతో అవ్వాతాతలు, ముఖ్యంగా దివ్యాంగులకు ఇంటివద్ద పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అందరూ గ్రామ సచివాలయాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిందే. ఇది పింఛన్ దారులకు మరింత ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా దీర్ఘకాలికంగా వ్యాధులతో మంచాన ఉన్నవారికి మరింత కష్టతరంగా మారింది. దీంతో చంద్రబాబు, ఆయన టీం పై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

8,400 మంది వలంటీర్లు సేవలు

జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 471 సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో 8,400 మంది వలంటీర్లు ఉన్నారు. వారంతా నిత్యం ప్రజలకు సేవలందిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలోనూ రాష్ట్రంలో ప్రజలకు సేవలు అందించారు. ఎన్నికల కమిషన్ తాజా ఉత్తర్వులతో ప్రజలకు దూరం చేయటంతో జిల్లావ్యాప్తంగా పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేశారు. మిగిలినవారూ అదే బాటలో పయనిస్తున్నారు. మొత్తంగా వలంటీర్లను ప్రజాసేవకు దూరం చేయడంపై పింఛన్‌దారులతోపాటు ప్రజలు కూటమి పార్టీలు, వారి అనుయాయులపై ఆగ్రహంతో ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు.

కష్టాల పాలు చేయడం తగదు



గత ఐదేళ్లలో వలంటీర్లు ప్రతీ నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ అందించే వారు. కరోనా లాంటి విపత్కర సమయాల్లో అండగా నిలబడి సేవలందించారు. చంద్రబాబు కుట్రపన్ని వలంటీర్లతో సేవా కార్యక్రమాలు చేయించకూడదని ప్రజలను కష్టాలకు గురిచేశాడు. పింఛన్లు నేరుగా తమ ఇళ్లవద్దకే వచ్చి అందించే వలంటీర్లను డబ్బులు ఇవ్వకుండా అడ్డుకోవడం చంద్రబాబు దుర్మార్గత్వానికి నిదర్శనం. మా ఉసురు తగలకపోదు.

– వై. మాణిక్యమ్మ, పింఛన్ లబ్ధిదారురాలు

నేనెట్టా పోవాలా ?



నేను బాపట్ల మండలంలోని రామయ్య వికలాంగుల కాలనీలో నివాసం ఉంటున్నాను. నేను పుట్టుకతోనే దివ్యాంగురాలిని. ప్రతి నెలా మా వలంటీర్ ఒకటో తారీకే పింఛన్ ఇంటికి తీసుకొచ్చి ఇచ్చేవారు. నేను ఇప్పుడు వెదుళ్లపల్లి గ్రామంలోని సచివాలయం వద్దకు వెళ్లాలంటా. మా కాలనీ నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లాలంటే మధ్యలో రైల్వేగేటు దాటుకొని వెళ్లాలి. నన్ను అక్కడికి ఎవరు తీసుకెళ్తారో అర్థం కావడం లేదు. మేము ఏం పాపం చేశాం.

– దక్కుమళ్ళ రత్నకుమారి, దివ్యాంగుల కాలనీ, బాపట్ల

మోకాళ్ల నొప్పులతో ఎలా వెళ్లాలి ?



నా వయస్సు 81 సంవత్సరాలు. పింఛన్ తెచ్చుకోవడానికి వెళ్లాలంటే అయ్యే పనికాదు. బీపీ, షుగర్ వ్యాధులున్నాయి. మోకాళ్ల నొప్పులతో నడవడం కూడా కష్టమైపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వలంటీర్ల సాయం లేకుంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పునరాలోచన చేయాలి. వలంటీర్లు వచ్చి పింఛన్ ఇవ్వాలని కోరుతున్నాం.

– దేవగిరి మోహన్‌రెడ్డి, ఆదిపూడి, కారంచేడు మండలం

బురద జల్లడం దుర్మార్గం



కరోనా సమయంలోనూ, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలోనూ వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. వారు లేకుంటే పథకాలు సక్రమంగా అందే పరిస్థితి ఉండేది కాదు. గతంలో ఇలాంటి వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇప్పుడు పింఛన్లు పంపిణీ చేయరాదంటూ ఈసీ చేత ప్రకటన చేయించేలా చేయడం ఎంత వరకు సమంజసం.

– బైలడుగు సుబ్బారావు, ముత్తేశ్వరం, బల్లికురవ మండలం

మళ్లీ బాధ వచ్చి పండిందే భగవంతుడా.. !



ఒకటో తేదీ నిద్రలేపి పింఛను ఇచ్చే వాళ్లు నా బిడ్డ లాంటి వలంటీర్. అయితే ఇపుడు చంద్రబాబు వచ్చి మా నోట్లో మట్టి కొట్టాడు. నేను సచివాలయం వద్దకు నడిచి వెళ్లే పరిస్థితిలో లేను. ఇప్పుడు ఏం చేయాలి భగవంతుడా.. మళ్లీ వెనకటి రోజులు పడ్డ కష్టాలు గుర్తుకొస్తున్నాయి.

– నూతలపాటి రాఘవమ్మ, పందిళ్లపల్లి, వేటపాలెం మండలం

చంద్రబాబు కూటమికి గుణపాఠం చెప్పాలి

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో ప్రారంభమైన ఎన్నికల ప్రచారం



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి పక్కన రేపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్

నిజాంపట్నం: జగనన్న మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలకు మరిన్ని మెరుగైన సంక్షేమ పథకాలు అందించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలోని మొగదారమ్మతల్లి ఆలయంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు బృందం ప్రజల్లోకి వస్తుందని, వారి మాయ మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. గత ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరువ చేయాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి విప్లవాత్మక పాలనకు నాంది పలకారని అన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీకే ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లు అందిస్తున్న వలంటీర్లపై మొదటి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ నాయకురాలు పురంధేశ్వరి, నిమ్మగడ్డ ప్రసాద్ విషం కక్కుతూనే ఉన్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల వలంటీర్లు పింఛన్‌లను పంపిణీ చేయకుండా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా రానున్నది జగనన్న ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ఒక్కరిపై ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి దాడి చేస్తున్నాయంటే జగనన్న ప్రజల్లో ఎంత బలంగా ఉన్నాడో అర్థమవుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ వంటి పార్టీలు ఎన్ని ఏకమైనప్పటికీ జగనన్న సునామీలో కొట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు గాదె మధుసూదనరెడ్డి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథబాబు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు మోపిదేవి రాజీవ్, ఈవూరు సృజన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రసాదం వాసుదేవ, మరకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపట్నంలో ప్రచారానికి హాజరైన ప్రజలు

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

- డీఐజీ జి. పాలరాజు ఆదేశం
- నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి
- రౌడీషీటర్ల కదలికలపై కన్నేసి ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ పాలరాజు

బాపట్ల టౌన్: పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని డీఐజీ జి. పాలరాజు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన సార్వత్రిక ఎన్నికలపై పోలీస్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తొలుత ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన నగదు, అక్రమ మద్యం, చెక్‌పోస్టుల వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీలపై ఆరా తీశారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సమర్థంగా ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తూ, ప్రజలంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించాలని చెప్పారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్ని పోలీస్ అధికారులు తరచూ సందర్శించాలని ఆదేశించారు. గ్రామాల్లో చెడునడత కలిగిన వ్యక్తులు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. వారి కార్యకలాపాల్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ శాంతిభద్రతకులకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేర చరిత ఉన్న వ్యక్తులను ముందుగానే బైండోవర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అరెస్ట్ వారెంట్‌లను వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ముద్దాయిలను వెంటనే అరెస్ట్ చేయాలని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా రవాణా జరిగే నగదు, మద్యం , ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి ఉపయోగించే బహుమతులు, వస్తువులను కట్టడి చేయాలని చెప్పారు. ప్రతిరోజు ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే వెంటనే ఆ ప్రదేశానికి చేరుకునే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్బీ సీఐ వి.మల్లికార్జున, డీసీఆర్‌బీ సీఐ పి.మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐలు ఏ.శ్రీనివాసరెడ్డి, సీహెచ్.సింగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పర్చూరు బరిలో గెలుపు ఖాయం

- పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ
- వలవర్ల నుంచి ఎన్నికల ప్రచారం



వలపర్లలో పర్యటిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ

మార్టూరు: రానున్న ఎన్నికల్లో పర్చూరులోనూ రాష్ట్రంలోని మెజారిటీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని వలపర్లలో సోమవారం ఎన్నికల శంఖారావం పూరించిన అయన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాటాలాడుతూ ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేసి పెన్షన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టడానికి కారణమయ్యారని బాలాజీ ఆరోపించారు. ఈ చర్య వల్ల టీడీపీ ప్రజాగ్రహానికి గురై వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ప్రస్తుత ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల్ని కొనసాగిస్తామని చెప్పే దమ్ము, ధైర్యం ప్రతిపక్ష పార్టీ నేతలకు ఉందా? అని బాలాజీ ప్రశ్నించారు.

అపూర్వ స్వాగతం పలికిన గ్రామస్తులు

వలపర్లలో గ్రామస్తులు బాలాజీకి ఘన స్వాగతం పలికారు. గ్రామ పొలిమేరలోని కోతి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి శివాలయం, వడ్డెర కాలనీలోని అంకమ్మ తల్లి ఆలయంలో పూజలు, ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అజీమ్, కాళహస్తి కృష్ణమూర్తి, కోటి నాగులు, సీతారామశాస్త్రి, బామర్ల శ్రీను, బడుగు అనూరాధ, జాషువా, కోటి, ప్రగడ రామారావు, మాధవరావు, పార్టీ మండల కన్వీనర్ పఠాన్‌కాలేషావలి, జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపీపీ బుక్యా శాంతిబాయి, యద్దనపూడి కారంచేడు, చినగంజాం జెడ్పీటీసీ సభ్యులు చుండి లక్ష్మీ నారాయణమ్మ, యార్లగడ్డ రజిని, ఆసోది భాగ్యలక్ష్మి , సీనియర్ నాయకులు ఉప్పలపాటి చెంగలయ్య, కొల్లా వెంకట్రావు, పాలెపేగు రాంబాబు, కాకోలు రామారావు, గడ్డం మస్తాన్ వలి, సులేమాన్, నియోజకవర్గంలోని ఆరు మండలాల సర్పంచులు పాల్గొన్నారు.

వలంటీర్లపై చంద్రబాబుకు కడుపుమంట

చీరాల: అహర్నిశలు ప్రజల కోసం పనిచేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుకు ప్రజలు రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య సంక్షేమ వారధిగా పనిచేస్తూ, పథకాలను నేరుగా వారి ఇంటి వద్దకే తెస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. పింఛన్లు కూడా ఇవ్వకూడదంటూ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేయించడం అన్యాయమని ఖండించారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లపై ప్రతిపక్షాలు అక్కసును వెల్లగక్కుతున్నాయని విమర్శించారు. కరోనా సమయంలో ప్రతిపక్ష పార్టీల నేతలందరూ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ నేతలందరికీ వలంటీర్లే సరైన సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

చంద్రబాబు పెత్తందార్ల పక్షం

- హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం జగనన్నే
- ఇంటింటా ప్రచారంలో అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



మల్లాయపాలెంలో వృద్ధులతో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

బల్లికురవ: చంద్రబాబు పెత్తందార్ల పక్షం.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షం అని అద్దంకి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో రోజు సోమవారం బల్లికురవ సమీపంలోని ఈర్లగంగమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతర పాతమల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు జగనన్న సంక్షేమ పథకాలకు రూ 2.75 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని తెలిపారు. 14 సంవత్సరాలపాటు, ముఖ్యమంత్రిగా పనిచేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఇచ్చిన 600 హామీలు అమలు చేయలేక పోయారని విమర్శించారు. సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ ఇంటికివచ్చి అందించే జగనన్న ప్రభుత్వం కావాలో.. జన్మభూమి కమిటీలతో ఎదురుచూసే ప్రభుత్వం కావాలో ఒక్కసారి ఆలోచించాలని కోరారు.

ఏ సమస్య వచ్చినా నేనున్నా..

తాను అద్దంకి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య అయినా నేరుగా తమను కలిసి పరిష్కరించుకోవాలని చిన హనిమిరెడ్డి తెలిపారు. మే13 జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌కు, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, రెండుసార్లు బటన్‌నొక్కి ఆశీర్వదించాలని కోరారు. మూడు గ్రామాల్లో హనిమిరెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు. ప్రచారంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, పార్టీ బాపట్ల జిల్లా ప్రధా కార్యదర్శి కల్లి అంజని, కన్వీనర్ ముద్దపాటి శంకర్, మల్లాయపాలెం, కొప్పరపాలెం గ్రామ సర్పంచులు జూపల్లి రాఘవరావు, వల్లంరెడ్డి అమల, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరావు, స్థానిక నేతు బండి గంగాప్రసాద్, సూరిబాబు, సూపల్లి లింగయ్య, సారెడ్డు శివరామరాజు, దేవినేని కృష్ణ, గన్నమనేని సీతారెడ్డి, ప్రత్తిపాటి అంకయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్తి పన్ను వసూళ్లలో జీఎంసీకి తృతీయ స్థానం

ఆదివారం ఒక్కరోజే రూ.5.09 కోట్ల వసూలు

నెహ్రూనగర్: 2024 ఆస్తి పన్ను వసూళ్లల్లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందని, చివరి రోజైన ఆదివారం ఒక్కరోజే రూ.5.09 కోట్లు వసూళ్లు చేసి ద్వితీయ స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా సద్వినియోగం చేసుకున్నారని, పన్ను వసూళ్ళలో రాష్ట్రస్థాయిలో విశాఖపట్నం, విజయవాడ తర్వాత 3వ స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందని తెలిపారు. సుమారు రూ.20 కోట్ల అన్ కలెక్టబుల్ డిమాండ్‌తో కలిపి మొత్తంగా ఉన్న రూ.143.46 కోట్ల ప్రైవేట్ డిమాండ్ గాను మార్చి 31 నాటికి రూ.98.25 కోట్లు వసూళ్లు చేయడం జరిగిందన్నారు. మార్చి 31 (ఆదివారం) ఒక్కరోజు రూ.5.09 కోట్లు వసూళ్లు చేయడం ద్వారా రాష్ట్రస్థాయిలో ఒక్కరోజులో అధిక కలెక్షన్ చేసి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ అసెస్మెంట్‌ల నుంచి సుమారు రూ.280.86 కోట్లు డిమాండ్ ఉండగా ఏప్రిల్1, 2023 నుంచి మార్చి 31, 2024 నాటికి అందులో 114.68 కోట్లు వసూళ్లు జరిగిందని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు నిర్ధారణ పరీక్షలు మంగళవారం నుంచి ప్రత్యేక శిబిరాల్లో నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న తెనాలి బాలాజీరావుపేట భవిత కేంద్రం, 3న పెదనందిపాడులోని భవిత కేంద్రంతో పాటు ఈనెల 4వ, 6వ తేదీల్లో గుంటూరు బ్రాడీపేట 2వ లైనులోని శారదానికేతన్ ప్రాంగణంలో ఉన్న సమగ్రశిక్ష జిల్లా సహిత విద్యా వనరుల కేంద్రంలో జరుగుతాయని వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ఆయా శిబిరాలకు తీసుకువచ్చి, ఉపకరణాలను ఉచితంగా పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రెండు వాహనాలు జప్తు

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తూర్పు నియోజకవర్గంలో తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రూ.15 లక్షలు విలువ చేసే స్కార్పియో వాహనంతోపాటు, రూ. 28 లక్షలు ఫజీరో వాహనాన్ని సీజ్ చేశామని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతోపాటు ఇప్పటి వరకు సీజ్ నగదు, మద్యం, వాహనాలు, ఇతర వస్తువుల విలువ రూ.1.72 కోట్లు అని తెలిపారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

- నామినేషన్ ప్రక్రియ 18నుంచి ప్రారంభం
- 26న పత్రాల పరిశీలన
- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. సాధారణ ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలిసి కలెక్టర్ స్థానిక స్పందన సమావేశ మందిరంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభమై 25వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన 26వ తేదీ ఉంటుందన్నారు. ఉపసంహరణ ప్రక్రియ 29వ తేదీన ముగుస్తుందని, మే 13న ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. 1,510 పోలింగ్ కేంద్రాలలో తాగు నీరు, ర్యాంప్, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు 120 శాతం ఈవీఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, వాటి వద్ద వెబ్ క్యాస్టింగ్, అబ్జర్వర్ల నిఘా ఉంచామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను అందిస్తామన్నారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి

నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా చెప్పారు. పార్లమెంటు నియోజకవర్గానికి జిల్లా కలెక్టర్ ఆర్వోగా వ్యవహరిస్తారని తెలిపారు. 18వ తేదీ నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సమయంలో అభ్యర్థులకు మూడు వాహనాలకే అనుమతి ఉందని స్పష్టం చేశారు. కార్యాలయానికి వంద మీటర్ల వరకు మాత్రమే వాహనాలకు అనుమతి ఉందన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థుల తోపాటు మరో నలుగురు మాత్రమే లోపలికి వెళ్లడానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కొక్క అభ్యర్థి నాలుగు నామినేషన్ పత్రాలు వేయడానికి అవకాశం ఉందన్నారు. అఫిడవిట్, ఓటు ధ్రువీకరణ పత్రం, పార్టీ బలపరిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు నామినేషన్‌తో పాటు ఇవ్వాలని సూచించారు. అభ్యర్థిపై క్రిమినల్ కేసులు ఉంటే పత్రికలు, చానల్స్‌లలో ముందస్తుగా ప్రకటన ఇవ్వాలని తెలిపారు.

ప్రతి మండలానికి తొమ్మిది టీంలు

ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయడానికి ప్రతి మండలానికి తొమ్మిది టీంల చొప్పున 54 టీంలు జిల్లాలో ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారుల టీంలు జిల్లాలో సమర్థంగా పనిచేస్తున్నాయని తెలిపారు. సీజర్ మేనేజ్‌మెంటు కింద రూ. 92 లక్షలు, రూ.58 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామని వివరించారు. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద అద్దంకి, బాపట్ల, చీరాల ప్రాంతాలలో మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. రూ.21వేలు జరిమానా విధించామని చెప్పారు. కోడ్ ఉల్లంఘించిన తొమ్మిది మంది వలంటీర్లు, నలుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, మరో ఇద్దరు ఎండీయూ వాహనాల నిర్వాహకులను తొలగించామని స్పష్టం చేశారు.

సి–విజిల్ యాప్ కింద 213 ఫిర్యాదులు

సి–విజిల్ యాప్ కింద 213 ఫిర్యాదులు ఇప్పటివరకు అందాయని, వాటిని తక్షణమే పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా తెలిపారు. ఫిర్యాదు వచ్చిన కేవలం 100 నిమిషాల్లోనే వాటిని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పొరపాటున ధ్రువీకరణ పత్రాలు లేకపోతే అలాంటి వారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. హోమ్ ఓటింగ్ విధానం తప్పనిసరి కాదని, దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే కల్పిస్తామని వివరించారు.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు : ఎస్పీ

సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. సరైన అనుమతులు లేకుండా ఎక్కడైనా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తరువాత బ్యాంక్ సెక్యూరిటీ సిబ్బంది తప్పా ఎవరూ ఆయుధాలు కలిగి ఉండడం గానీ, ప్రదర్శించడం గానీ చేయరాదని తెలిపారు. జిల్లాలో మొత్తం 137 లైసెన్స్ కలిగిన తుపాకులు ఉన్నాయని, వాటిలో 86ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మిగిలిన 51 తుపాకులు బ్యాంకింగ్ సెక్టార్లలో విధులు నిర్వహిస్తున్న వారి వద్ద ఉన్నాయని వివరించారు. జిల్లాలో డిసెంబర్‌కు ముందు 508 నాన్ బెయిల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, ప్రస్తుతం జిల్లాలో పెండింగ్ వారెంట్లు లేవని తెలిపారు. 269 ప్రాంతాలలోని 337 పోలింగ్ కేంద్రాల్ని సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. జిల్లాలో మొత్తం 12 చెక్ పోస్టులను ఏర్పాటు చేయగా, సరిహద్దులలో తొమ్మిది ఉన్నాయన్నారు. మిగిలిన మూడు చెక్ పోస్టులను అంతర్గతంగా జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. గత సంవత్సరం డిసెంబర్ నుంచి జిల్లాలో పాత నేరస్తులు, రౌడీలను 488 మందిని, ఎన్నికల సమయంలో అల్లర్లు గొడవలు చేయడానికి అవకాశం ఉన్న 7,557 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తరువాత 107 సీఆర్‌పీసీ కింద 264 మందిని, 110(ఇ)సీఆర్‌పీసీ కింద 66 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత 154 కేసులలో రూ.8,68,890 విలువైన 10,126 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. మద్యంతో పాటు 14 వాహనాలను సదరు కేసులలో సీజ్ చేశామని, వాటి విలువ సుమారు రూ.43,98,000 ఉంటుందని వివరించారు. నగదు రూ. 91,15,630ను సీజ్ చేశామన్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇప్పటికే 400% అధికంగా మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఆర్టీసీ కానిస్టేబుల్ ?

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల కమిషన్ ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దంటూ ఆదేశించినప్పటికీ కొంతమంది ఉద్యోగులు పార్టీ కార్యకర్తల్లాగా నాయకుల వెంబడి పాల్గొంటున్నారు. వినుకొండ ఆర్టీసీ డిపో గ్యారేజీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రావర్ల అనిల్ తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు బహిరంగంగానే ర్యాలీలో తిరుగుతున్నాడు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కుమారుడు గోనుగుంట్ల హరీష్ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నారు. దీనిపై ఎన్నికల అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జేడీ శీలం



పర్చూరు (చినగంజాం): బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం జేడీ శీలంను ఎంపిక చేసినట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శివనాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేడీ శీలంను ఎంపిక చేసినందుకు పీసీసీ అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పేదలను కించపరిచే బాబుకి పతనం తప్పదు


కొల్లూరులో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ

- బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు
- వేలాది కార్యకర్తలు, అభిమానుల మధ్య ఎన్నికల ప్రచారం ఆరంభం


కొల్లూరులో ప్రచారం చేస్తున్న నేతలు

కొల్లూరు : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పాలనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు పతనాన్ని శాసించనుందని బాపట్ల ఎంపీ, ప్రస్తుత బాపట్ల వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ అన్నారు. సోమవారం కొల్లూరు మండలం చిలుమూరు నుంచి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమాన గణం నడుమ వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ నోటి దురుసుతనంతో దళితులు, వెనుకబడిన వర్గాలను కించపరచడం చంద్రబాబుకు కొత్తకాదన్నారు. గతంలోనూ ఎస్సీసార్లు చులకన చేసే విధంగా మాట్లాడి, తన దిగజారుడుతనాన్ని చాటుకున్నారన్న విషయాన్ని ప్రజలందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. వెనుకబడిన వర్గాలను చట్టసభల్లోకి తీసుకెళ్లాలన్న తలంపుతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లారీ డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే, దాన్ని అవమానించేలా మాట్లాడిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో లక్షల సంఖ్యలో ఉన్న డ్రైవర్లే తమ ఓటు రూపంలో తగిన గుణపాఠం నేర్పనున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో, ప్రజలు, భగవంతుడిని నమ్ముకుని ఎన్నికల్లో ముందుకు వెళుతున్నామని వివరించారు. వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో అందుబాటులో లేని టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబుకు ఓటు అడిగే అవకాశం ఏమాత్రం లేదని తెలిపారు. బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పరిపాలనను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తొలుత వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా మండలంలోని చిలుమూరు తరలివెళ్లిన నాయకులు, స్థానిక రామలింగేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరికూటి అమృతపాణి, ఐదు మండలాల కన్వీనర్లు సూర్యదేవర రామకృష్ణ, బొల్లిముంత ఏడుకొండలు, యలవర్తి సురేష్‌బాబు, మోర్ల శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రఘురామరెడ్డి, ఎంపీపీలు యల్లమాటి మోహన్, రాపర్ల నరేంద్ర, జాలాది రూబేన్, జెడ్పీటీసీ సభ్యులు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, బావిరెడ్డి వెంకట్రామయ్య, బుల్లా నవరత్నం, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, సర్పంచ్‌లు సనకా వెంకట్రావు, భూపతి కిశోర్, ఉయ్యూరు అప్పిరెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్‌లు తూము నాగేశ్వరరావు, నిమ్మగడ్డ శివయ్య, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, నాయకులు ధూళిపూడి సత్యనారాయణ, గాదె శివరామకృష్ణారెడ్డి, కనపర్తి మోహన్‌రావు, శింగం కృష్ణప్రసాద్, కూచిపూడి మోషే, వెనిగళ్ల శ్రీనివాసరావు, ఆళ్లమూడి మధు, మాతంగి రత్నకుమార్, దూళిపాళ్ల రాంబాబు, తోడేటి రత్నాకర్, ఉప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు

చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్


వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న వాడరేవు ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశీరావు, నాయకులు


మాజీ కౌన్సిలర్ శివరాంప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటేష్

చీరాల: కష్టపడిన ప్రతి కార్యకర్తకూ పార్టీలో గుర్తింపు ఉంటుందని చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం రామకృష్ణాపురంలోని క్యాంప్ కార్యాలయంలో వాడరేవు గ్రామానికి చెందిన 30 మత్స్యకార కుటుంబాలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశీరావు తదితరులు వెంకటేష్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి వివిధ వర్గాలు, సామాజిక వర్గాల నుంచి మద్దతు రోజురోజుకు పెరుగుతోందన్నారు. గత ఐదేళ్లుగా చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు సుందర, ప్రశాంతమైన చీరాలగా తీర్చిదిద్దామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీని బలోపేతం చేయాలని వెంకటేష్ సూచించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వాడరేవులో పార్టీని బలోపేతం చేయడంతో పాటు జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ మాజీ సీనియర్ కౌన్సిలర్ కాటా శివరామ్‌ప్రసాద్ అనుచరులు, ఇతర నాయకులు వెంకటేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వార్డులో మంచి పట్టున్న నాయకుడు, సీనియర్ కౌన్సిలర్ వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటా హనుమంతరావు, డాక్టర్ కె.వి.పుల్లారావు, టి.వి.ఎస్. ప్రసాద్, యుగంధర్, రాజా, శంకర్, విజయ్, ప్రభాకరరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబుకు తొత్తుగా మారిన ఎల్లో మీడియా


ఎమ్మెల్యే అభ్యర్థి చిన హనిమిరెడ్డి




అద్దంకి: చంద్రబాబుకు తొత్తుగా ఎల్లో మీడియా మారిందని అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. బల్లికురవ మండలంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన తనతో పాటు బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను ప్రజలు నిలదీశారంటూ ఏబీఎన్ చానల్ తప్పుడు వార్తను ప్రసారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవ ప్రసారాలపై ఆయన సోమవారం ఒక వీడియోను రిలీజ్ చేశారు. అక్కడ రెండు చర్చిల పాస్టర్ల మధ్య చిన్న వివాదాన్ని ఎంపీ సర్ది చెబితే దాన్ని మార్చి తమను నిలదీశారంటూ వార్తను ప్రసారం చేయడం సరికాదని తెలిపారు. ఏబీఎస్ చానల్ చంద్రబాబు నాయుడుకకు తొత్తుగా మారిందని విమర్శించారు. నిజానికి దగ్గరగా ఉండే వార్తలు ప్రచురిస్తే చానల్‌కు మంచి పేరు వస్తుందని సలహా ఇచ్చారు. ఇకనైనా అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెప్తారని హితవు పలికారు.

నూర్పిడి మిషన్ పైనుంచి పడి మహిళ మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- పరామర్శించిన ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్


ప్రమాద స్థలంలో బుజ్జమ్మ మృతదేహం


బాధితురాలిని పరామర్శిస్తున్న కరణం వెంకటేష్


ప్రమాదానికి కారణమైన నూర్పిడి మిషన్

వేటపాలెం: ట్రాక్టర్ వెనక ఉన్న నూర్పిడి మిషన్ డోర్ ఊడి పోవడంతో దానిపై కూర్చుని ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారి 216 అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురం వద్ద బైపాస్ రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అక్కాయిపాలేనికి చెందిన ట్రాక్టర్ నూర్పిడి మిషన్‌తో పాటు కూలీలను ఎక్కించుకొని పాపాయిపాలెం గ్రామానికి వెళ్తోంది. పైన కొంతమంది కూర్చొని ఉండగా, మరో నలుగురు మహిళలు వెనక పైపున్న నూర్పిడి మిషన్‌పై కూర్చున్నారు. బైపాస్ రోడ్డుపై వెళుతుండగా, నూర్పిడి మిషన్‌కి సైడు భాగంలో ఉన్న ఇనుప డోర్ అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో డోర్ పైభాగంలో కూర్చొన్న మహిళా కూలీలు రోడ్డుపై పడిపోయారు. అందులో నక్కల బుజ్జమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురి మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. 108వాహనంలో బాధితుల్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ జీ సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. బుజ్జమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లు చీరాల ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందున్న మహిళలను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన నక్కల బుజ్జమ్మ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అత్యద్భుతం 'ఈస్టర్ కంటాట' నాటిక

వేల సంఖ్యలో హాజరై తిలకించిన విశ్వాసులు


ఏసుక్రీస్తుకు శిలువ వేసిన సన్నివేశం


ప్రభువైన ఏసుక్రీస్తు గలిలియ సముద్రంలో నడుస్తున్న దృశ్యం

చీరాల రూరల్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని 'ఈస్టర్ కంటాట' అను ఆధ్యాత్మిక నాటికను ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ సహకారంతో చర్చి మైదానంలో సువార్త వేదికపై ఆదివారం రాత్రి నాటికను ప్రదర్శించారు. ప్రభువైన ఏసుక్రీస్తు సిలువపై మరణం, పునరుత్థాన వంటి దృశ్యాలను 80 మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారులు కళ్లకు కట్టినట్టు విద్యుద్దీపాల వెలుగులలో ప్రదర్శించారు. ప్రభువైన యేసుక్రీస్తు పడిన శ్రమలను వీక్షించిన వేల సంఖ్యలో క్రైస్తవ విశ్వాసుల కళ్లు చెమర్చాయి. నాటికకు ముందుగా అంతర్జాతీయ ప్రసంగీకులు ఐజక్ కిమ్ దేవుని వాక్య సందేశాలు అందజేశారు. ముందుగా నూతనంగా నిర్మించిన సువార్త వేదికను ఏఈఎల్‌సీ తూర్పు గుంటూరు సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ కూరాకుల రత్నమోహన్, ఏఈఎల్‌సీ సెక్రటరి చిన్నం కిశోర్ బాబు, చర్చి పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, రెవరెండ్ పిల్లి దేవదాసు, ఐజక్ కిమ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్తులతో పాటు చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు వేళ సంఖ్యలో హాజరయ్యారు. చర్చి రోడ్డు కార్లు, దిచక్రవాహనాలు, ఆటోలతో నిండిపోయింది.

ఎల్లో మీడియాపై భగ్గుమన్న మహిళలు


రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళలు

బల్లికురవ: ఎల్లో మీడియా తప్పుడు వార్తలు, ప్రసారాలతో తమ మనోభావాలను దెబ్బతీస్తోందని బల్లికురవ మండలంలోని ఎస్సీ కాలనీ మహిళలు సోమవారం సాయంత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ప్రచారం ముగింపులో స్థానిక చర్చిలో ప్రార్థనలో పాల్గొన్నారన్నారు. ఎంపీ సురేష్ వెంట గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు ఉండటంతో 'మీరు ఎందుకు వచ్చారు.. మా ప్రోగ్రాం' అని బయటకు పొమ్మని చెప్పామన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సురేష్‌నే బయటకు పొమ్మన్నరంటూ అసత్య ప్రచారాలు చేసిందని, ఎల్లో మీడియా తీరు మార్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, మోసపూరిత మాటలను నమ్మే పరిస్థితుల్లో లేమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్న రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపడతారని ముక్తకంఠంతో ప్రకటించారు. ఎంపీగా నందిగం సురేష్‌కు, అద్దంకి ఎమ్మెల్యేగా హనిమిరెడ్డి గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని ప్రకటించారు. నిరసనలో భాగంగా ఎస్సీ కాలనీలో ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు.